క్లుప్తంగా

స్నానాల గది నిర్మాణానికి రూ. లక్ష విరాళం



విరాళాన్ని రోటరీ అధ్యక్షుడు శ్రీనివాసరావుకు అందిస్తున్న శేఖర్

కంచిలి: మండల కేంద్రంలో మఠం కంచిలి వద్ద గల స్వర్గధామంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో స్నానాల గది నిర్మాణానికి రొటేరియన్ కొత్తకోట శేఖర్ ఒక లక్ష రూపాయలను విరాళంగా ప్రకటించారు. ఈ మొత్తాన్ని రోటరీ అధ్యక్షుడు దుద్ది శ్రీనివాసరావు, సెక్రటరీ పి.వి.కృష్ణారావు, ట్రెజరర్ కె.రవికుమార్‌లకు బుధవారం అందించారు.

ప్రభుత్వ కళాశాలలో అడ్మిషన్లపై ప్రచారం



నారాయణబట్టి గ్రామంలో విద్యార్థులతో మాట్లాడుతున్న కళాశాల అధ్యాపకులు

కంచిలి: మండల కేంద్రం కంచిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టడం కోసం కళాశాల ప్రిన్సిపాల్ వి.జగదీష్ ఆధ్వర్యంలో అధ్యాపకులు ప్రచారం చేపట్టారు. ఇందులో భాగంగా బుధవారం మండలంలోని నారాయణబట్టి, గుండాం, కర్తలి, ఎం.ఎస్.పల్లి గ్రామాల్లో పర్యటించారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి అడ్మిషన్లు జరుగుతున్నాయని ప్రిన్సిపాల్ చెప్పారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూప్‌లలో తెలుగు, ఒడియా, ఇంగ్లిష్ మీడియంలో బోధన కలదని, నామమాత్ర ఫీజులతో అత్యుత్తమ విద్యాబోధన అందిస్తున్నామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ కళాశాలలో చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. అధ్యాపకులు వేణుగోపాల్, వాసుదేవ్, బబిత పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంఘిక నాటకం



నాటక ప్రదర్శనలో చిన్నారులు

టెక్కలి: స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా బుధవారం నిర్వహించిన సాంఘిక నాటకం ఆకట్టుకుంది. స్నేహితుడిలో వచ్చిన మార్పు అనే అంశంపై విద్యార్థులు వేసిన నాటకం విశేషంగా అలరించింది. గ్రంథాలయాధికారి బి.రూపావతి, విశ్రాంత ఆంగ్ల ఉపాధ్యాయుడు మోహన్‌రావు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

కాశీబుగ్గ: పలాస 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతులు చేపడుతున్న కారణంగా ఈ నెల ఏడో తేదీ ఉదయం పది నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు పలు ప్రాంతాలకు సరఫరాను నిలిపి వేస్తున్న పలాస డివిజన్ విద్యుత్‌శాఖ ఈఈ జి.ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. శాసనం, మొగలిపాడు, కేటీ రోడ్డు, అన్నపూర్ణ ఆశ్రమవీధి ఏరియా, కంచర వీధి, పెద్దవీధి, శ్రీనివాసనగర్, ఉదయపురం, సీతారాంనగర్, వాసుదేవ్‌పేట, హడ్కోకాలనీ, శివాజీనగర్, సూదికొండ, లేబర్‌కాలనీ, వివేకానంద కాలనీ, గాంధీనగర్, న్యూకాలనీ, ఫిష్ మార్కెట్ ఏరియా, తిలక్‌నగర్, ఎస్‌బీఐ స్వైఎం డిగ్రీ కాలేజీ రోడ్డు, జెడ్పీ హైస్కూల్ రోడ్, పల్లివీధి, శారదనగర్ పరిసర ప్రాంతాలకు సరఫరా ఉండదని..వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పలాస డివిజన్ విద్యుత్‌శాఖ ఈఈ జి.ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

కంచిలి: కంచమ్మతల్లి అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని వెంకటేశ్వరుని ఆలయం అభివృద్ధికి ఎన్ఆర్ఐ కొంచాడ శ్రీనివాసరావు రూ. 50,011లు విరాళాన్ని అందజేశారు. ఈ మేరకు దేవస్థానం బ్యాంకు అకౌంట్‌లో జమచేసినట్లు ఆలయ ప్రతినిధులు బుధవారం తెలిపారు.

అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు



పూజలందుకున్న స్వామివారు

శ్రీకాకుళం కల్చరల్: బలగలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో బుధవారం సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ అర్చకులు దేవరకొండ శంకరనారాయణశర్మ ఆధ్వర్యంలో స్వామికి పాలతో అభిషేకాలు నిర్వహించి స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



ఇచ్ఛాపురం: పర్యావరణ దినోత్సవ కార్యక్రమంలో హెచ్ఎం రవణమ్మ తదితరులు



ఇచ్ఛాపురం: జ్ఞానభారతి పాఠశాలలో మొక్కలు నాటుతున్న సిబ్బంది



టెక్కలి: మొక్కలు నాటుతున్న వివేకానంద తదితరులు



టెక్కలి: మాట్లాడుతున్న ప్రొఫెసర్ రామ్మోహన్‌రావు



కాశీబుగ్గ: మొక్కలు నాటుతున్న లయన్స్‌క్లబ్ సభ్యులు



సోంపేట: కళాశాల పరిసరాలు శుభ్రం చేస్తున్న విద్యార్థులు



ఇచ్ఛాపురం రూరల్: పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న దృశ్యం



పలాస:మొక్కను నాటుతున్న ఎమ్మెల్యే శిరీషా

వజ్రపుకొత్తూరు రూరల్: మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని గ్రీన్ ఆర్మీ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు బోనెల గోపాల్, సూర్యతేజ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ దానేటి పద్మజ అన్నారు. ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా మండలంలోని అక్కుపల్లి, మోట్టూరు గ్రామాల్లో బుధవారం పలు రకాల మొక్కలను నాటారు. అనంతరం పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మొక్కలను నాటి భూతాపాన్ని నియంత్రించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. మొక్కలను నాటే కార్యక్రమాన్ని ఉద్యమంలా చేపట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అక్కుపల్లి శ్రీరామ సేవా సంఘం అధ్యక్షుడు ఎం.కామేశ్వరరావు, ఉపాధ్యక్షులు ఎం.జయశంకర్, సోమేశ్వరరావు, జోగి రాజు, మద్దు తాతారావు, ఎం.కుమారస్వామి, గ్రీన్ ఆర్మీ ప్రతినిధులు, ఉపాధ్యాయులు బి.తిరుమల,రవీంద్రనాథ్‌ఠాగూర్, కిశోర్ పాత్రో, బి.దుర్యోధన, పి.శ్రీనివాస్ ఉన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం

ఇచ్ఛాపురం: ప్రతీఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాలని మున్సిపల్ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రవణమ్మ అన్నారు. మున్సిపల్ బాలికోన్నత పాఠశాల, ప్రభుత్వోన్నత పాఠశాల, ఆదర్శపాఠశాలలతో పాటు సీబీఎస్‌సీ జ్ఞానభారతి పాఠశాలల్లో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ర్యాలీలు చేపట్టారు. కార్యక్రమంలో నేషనల్ గ్రీన్‌కార్ప్స్ ప్రతినిధులు గగణకుమారి, వల్లభరావు, ఉపాధ్యాయ సిబ్బంది, జోహార్‌ఖాన్, రషీదా సుల్తానా, పండా పాల్గొన్నారు.

అందరి బాధ్యత

టెక్కలి: మానవ మనుగడ కోసం వాతావరణాన్ని కాపాడుకునే బాధ్యత మనందరిపై ఉందని టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల సివిల్ విభాగం ప్రొఫెసర్ హెచ్.రామ్మోహన్‌రావు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా 'మన భూమి–మన భవిష్యత్' అనే అంశంపై కళాశాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వాతావరణ పరిరక్షణ కోసం తీసుకోవాల్సిన అంశాలపై అవగాహన కల్పించారు. కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, హెచ్‌ఓడీ పి.దినకర్‌తో పాటు అధ్యాపకులు పాల్గొన్నారు.

- సోంపేట: పర్యావరణ పరిరక్షణకు విద్యార్థులు కృషిచేయాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.మోహనరావు అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాఠశాల పరిసరాలు శుభ్రం చేశారు. పర్యావరణ పరిరక్షణపై అధ్యాపకులు అవగాహన కల్పించారు. అధ్యాపకులు ఎ.రామినాయుడు, ఎం.ప్రసాద్, టి.యుగంధర్, టి.ప్రవీణ్, జి.సంధ్యారాణి, ఆర్.కల్పన, డి.నారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.
- ఇచ్ఛాపురం రూరల్: పచ్చని చెట్లను పెంచి పర్యావరణాన్ని కాపాడుకుందామని గ్రామ పెద్ద, పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యుడు కాళ్ల మాధవరావు అన్నారు, భవానీపురం ప్రాథమిక పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. అంగన్‌వాడీ కార్యకర్త బర్రి నరసమ్మ, గ్రామస్తులు హరి, మట్ట తాతయ్య, మట్ట త్రినాథ్, ఇనుముల కార్తీకరావు పాల్గొన్నారు.
- టెక్కలి: ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని టెక్కలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డి.వివేకానంద సూచించారు. కోర్టు సముదాయం ప్రాంగణంలో తోటి న్యాయవాదులతో కలిసి మొక్కలు నాటారు. న్యాయవాదులు పి.ఆనంద్, ఎం.గోవింద్, డి.ధర్మారావు, పి.ఆజాద్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.
- పలాస: శాసనం గ్రామంలో పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషా పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలను నాటారు. ప్రతిఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని అన్నారు. టీడీపీ నాయకుడు మల్లా శ్రీనివాసరావు పాల్గొన్నారు.
- కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ పైల జవహర్ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. విద్యార్థులు, పౌరులు బాధ్యతగా భావించి ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు రోణంకి హేమాచలం, సెక్రటరీ తమ్మినాన మాధవరావు, కోశాధికారి నెమలిపురి అప్పారావు, వీరఘట్టం వెంకటరావు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు ఉన్నారు.

ఎమ్మెల్యే అశోక్‌కు ఘన స్వాగతం



కంచిలిలో ఎమ్మెల్యే అశోక్‌కు స్వాగతం పలుకుతున్న స్థానికులు

కంచిలి: ఇచ్ఛాపురం ఎమ్మెల్యేగా మూడోసారి గెలుపొందిన బెందాళం అశోక్ తొలిసారిగా నియోజకవర్గంలో బుధవారం అడుగుపెట్టారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. సోంపేట మండలం కొర్లాం వద్ద జాతీయ రహదారిపైన ఎదురుగా వెళ్లి స్వాగతం పలికి కంచిలి మీదుగా కవిటి వరకు వాహనశ్రేణితో ర్యాలీగా వెళ్లారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

గౌతు శిరీషాను కలిసిన పీసీఎంఏ సభ్యులు



శిరీషాను అభినందిస్తున్న పీసీఎంఏ ప్రతినిధులు

కాశీబుగ్గ: పలాస ఎమ్మెల్యేగా ఎన్నికై న గౌతు శిరీషాను స్థానిక కాషూ్య మాన్యుఫ్యాక్చర్ అసోసియేషన్ (పీసీఎంఏ) కార్యవర్గ సభ్యులు శాసనాం గ్రామంలో బుధవారం కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. పీసీఎంఏ అధ్యక్షులు మల్లా సురేష్, ప్రధాన కార్యదర్శి కె.వి.శివక్రిష్ణ, కోశాధికారి పట్నాన రవికాంత్, గౌరవ అధ్యక్షులు బెల్లాల నారాయణరావు, ఉపాధ్యక్షుడు శాశనపురి మురళి, జాయింట్ సెక్రటరీ తర్లాన వెంకటరమణ, మల్లా శ్రీనివాసరావు తదితరలు ఉన్నారు.

దివ్యాంగుల బోగీల్లోకి సాధారణ ప్రయాణికులు!



యశ్వంత్‌పూర్ సూపర్‌ఫాస్ట్ రైలు దివ్యాంగుల బోగిలోకి ఎక్కుతున్న సాధారణ ప్రయాణికులు



సాధారణ ప్రయాణికులతో రద్దీగా ఉన్న దివ్యాంగుల బోగీ

కాశీబుగ్గ: వేసవి సెలవులు ముగుస్తుండడంతో రైళ్లలో ప్రయాణికుల రద్దీ రోజురోజుకూ పెరుగుతోంది. దీంతో ఏసీ బోగీలు తప్పిస్తే జనరల్, రిజర్వేషన్ తేడా లేకుండా జనం కిక్కిరిసి ప్రయాణం చేస్తున్నారు. ఎక్స్‌ప్రెస్, సూపర్ ఫాస్ట్ రైళ్లకు ప్రారంభంలో ఉన్నటువంటి మహి, దివ్యాంగుల బోగీల్లో సాధారణ టిక్కెట్లు తీసుకున్నవారు ఎక్కేస్తున్నారు. దీంతో దివ్యాంగులు, మహిళా ప్రయాణికులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. రైల్వే ఉన్నతాధికారులు, టికెట్ కలెక్టర్, గార్డులు, ఆర్‌పీఎఫ్, స్పెషల్ స్క్వాడ్ సరైన పర్యవేక్షణ లేకపోవడంతో ఇలా జరుగుతుందనే విమర్శలు వస్తున్నాయి. దివ్యాంగుల బోగిలో ప్రయాణానికి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ఇసుక తరలింపు సమాచారంతో పోలీసుల తనిఖీలు

టెక్కలి: టెక్కలి ఆర్టీసీ డిపోకు ఆనుకుని ఉన్న స్టాక్ పాయింట్ నుంచి బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారనే సమాచారంతో పోలీసులు తనిఖీలు చేశారు. స్టాక్ పాయింట్‌లో లైట్లు ఆర్పివేసి మరీ ఇసుకను తరలిస్తున్నారనే సమాచారం మేరకు సీఐ పైడయ్య తన సిబ్బందితో కలిసి స్టాక్ పాయింట్ వద్ద తనిఖీలు చేశారు. సమాచారంపై ఆరా తీసి వివరాలు సేకరిస్తున్నారు.

లోక్‌జనశక్తి అభ్యర్థుల విజయంపై హర్షం

కంచిలి: దివంగత రామ్‌విలాస్ పాశ్వాన్ స్థాపించిన లోక్‌జనశక్తి పార్టీ తరపున ఆయన తనయుడు చిరాగ్ పాశ్వాన్ అధ్యక్షతన తాజా గా జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించడంపై పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎం. ఆదినారాయణ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఈ పార్టీ నుంచి ఐదుగురు ఎంపీలుగా ఎన్నికయ్యారని తెలిపారు.

పరీక్ష కేంద్రాన్ని సందర్శించిన ఆర్‌జేడీ

టెక్కలి: టెక్కలి ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రం జరుగుతున్న ఇంటర్ ఓపెన్ సప్లిమెంటరీ పరీక్షలను ఆర్‌జేడీ జ్యోతికుమారి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించారు. పరీక్షల నిర్వాహణపై ఆరా తీశారు. ఎంఈవో డి.చిన్నారావు, చీఫ్ సూపరింటెండెంట్ ఆర్.శ్రీనివాసరావు, డిపార్ట్‌మెంట్ అధికారి కె.దాలయ్య ఉన్నారు.

15న విద్యార్థులకు నేత్ర పరీక్షలు

కాశీబుగ్గ: విద్యార్థులకు ఈ నెల 15వ తేదీన ఉచితంగా నేత్ర పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డాక్టర్ షీలా కంటి ఆస్పత్రి ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆరోజు ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు కాశీబుగ్గలోని ఎల్ఐసీ బిల్డింగ్ గ్రౌండ్ ఫ్లోర్‌లో నేత్ర శిబిరాన్ని నిర్వహిస్తామన్నారు.

టెక్ మహీంద్రాకు ఆదిత్య విద్యార్థులు ఎంపిక

టెక్కలి: టెక్ మహీంద్ర సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగాలకు టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సీఎస్ఈ, ఈసీఈ, ఐటీ బ్రాంచ్‌లకు చెందిన 10 మంది విద్యార్థులు ఈ ఉద్యోగాలకు ఎంపికైనట్లు వెల్లడించారు. ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, హెచ్‌ఓడీలు యు.డి.ప్రసన్న, బి.రామారావు, వై.రమేష్ తో పాటు ప్లేస్‌మెంట్ అధికారి ఎం.వి.ఎస్.ఎస్.కుమార్ విద్యార్థులను అభినందించారు.

ఘనంగా మహాలింగార్చన



మహాలింగార్చన నిర్వహిస్తున్న అర్చకులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారి ఆలయంలో మాసశివరాత్రి సందర్భంగా బుధవారం ఉదయం అనివెట్టి మండపంలో మహాలింగార్చన కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో మహాపర్వం శివ పంచాయతన సహిత మహాలింగార్చనను అర్చకులు ఇప్పిలి ఫణీంద్ర శర్మ చేపట్టారు. అధికసంఖ్యలో భక్తులు లింగార్చనలో పాల్గొన్నారు. అనంతరం ఆదిత్యున్ని దర్శించుకున్నారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం



సమావేశంలో మాట్లాడుతున్న ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు

పలాస: పలాస మండలం నీలావతి యువీవీ గ్రంథాలయంలో 40 రోజులపాటు విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరం బుధవారంతో ముగిసింది. హైస్కూల్ విద్యార్థులకు, ముఖ్యంగా పదో తరగతిలో చేరబోయే పిల్లలకు ఉపయోగపడేలా గణితం, ఇంగ్లిష్, ఐఐటీ ఫౌండేషన్ తదితర సబ్జెక్టులపై ప్రావీణ్యం గల ఉపాధ్యాయులచే తరగతులు నిర్వహించారు. ఉపాధ్యాయులు ఈగల శ్రీనివాసరావు, ఎస్.వెంకటేష్, బట్టి రాజులను యువీవీ బృందం అభినందించింది. కార్యక్రమంలో యువీవీ అధ్యక్షుడు బొమ్మాళి శివ, గౌరవ అధ్యక్షుడు కుత్తుం ప్రకాశరావు, పాలిన కృష్ణారావు, జినగ సీతారామయ్య, కుత్తుం సుధాకర్, కుత్తుం వినోద్, లైబ్రేరియన్ గాయత్రి ఉన్నారు.

నేడు, రేపు
నీటి సరఫరా బంద్


కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ ప్రజలకు నీటిని సరఫరా చేసే మూడో నంబర్ బావి వద్ద మెయిన్ పంపింగ్ పైపులైన్ బుధవారం పాడైంది. దీంతో మరమ్మతులు చేపడుతున్నందున ఈ గురు, శుక్రవారాల్లో నీటి సరఫరాను నిలిపి వేస్తున్న సంబంధిత ఇంజినీరింగ్ విభాగం అధికారులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పురపాలక సంఘ, అద్దె ట్యాంకర్లతో మంచినీటిని సరఫరా చేస్తామని.. ప్రజలు గమనించాలని కోరారు.



మరమ్మతులు చేపడుతున్న సిబ్బంది

13 నుంచి శివకామేశ్వరస్వామి వార్షికోత్సవాలు

శ్రీకాకుళం కల్చరల్: మొండేటివీధిలోని లలితా దేవి సహిత శివకామేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకలు ఈనెల 13 నుంచి 17వ తేదీ వరకు జరుగుతాయని షిర్డీసాయి సేవా సంఘం సభ్యులు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 13న ఉదయం పందిరాట కార్యక్రమం , 15న ఉదయం అష్టోత్తర సహిత బిల్వార్చనలు, 16న ఉదయం సామూహిక మహన్యాస పూర్వ రుద్రాభిషేకాలు, 17న సాయంత్రం శివ పార్వతుల కల్యాణ మహోత్సవం జరుగుతోందని.. భక్తులందరూ పాల్గొనాలని కోరారు.



శివ కామేశ్వరస్వామి